వైద్య పోస్టులకు ఆహ్వానం

ఉట్నూర్, ఆగస్టు 16 : ఉట్నూర్ జిల్లా దవాఖానలో వైద్య పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వైద్యులు కాంట్రాక్ట్ పోస్టులకు గాను జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్ సర్జన్, అనస్థీషియా, పల్మోనాలజిస్ట్ నిపుణులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9849878635 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు ప్రైవేట్ దవాఖానలు మూసివేత

ఎదులాపురం, ఆగస్టు 16 : కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ ఐఎంఏ (దస్నాపూర్ శాఖ) ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ దవాఖానలు మూసివేస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాం ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు దవాఖానలు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నియంత్రించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఖానాపూర్, ఆగస్టు 16 : ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు ఖానాపూర్‌లోని ప్రైవేట్ దవాఖానల్లో శనివారం వైద్య సేవలు నిలిపివేయనున్నట్లు డాక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అయిల్నేని కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా ఖానాపూర్‌లో బంద్ ప్రకటిస్తున్నట్లు వివరించారు. దవాఖానల్లో అత్యవసరమైతే చికిత్స అందిస్తూ రోజువారి వైద్య సేవలు నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు రోగులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మంత్రిని కలిసిన తుల శ్రీనివాస్

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, ఆగస్టు 16: సొనాలలోని రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమా ఆటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. విన్నపం మేరకు మంత్రి వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా అధికారులను పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ చొరవతో రూ.2.50 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, సెంట్రల్ లైట్లు మంజూరుకు చొరవ తీసుకున్న మంత్రికి తుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎంపీ నగేశ్‌తో గ్రామస్తులు

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 16: సిరికొండ మండలం పాలవాగు, కుంటగూడ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు శుక్రవారం ఆదిలాబాద్‌లో ఎంపీ నగేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇంత వరకు రోడ్డు సౌకర్యం లేదని, బీఎస్ఎన్ఎల్ షార్ట్ టవర్ పని చేయడం లేదన్నారు. పాలవాగులో 20 మంది పిల్లలు ఉన్న ఉపాధ్యాయులు లేక విద్యకు నోచుకోలేకపోతున్నారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఇక్కడ కుంటగూడ మాజీ సర్పంచ్ గంగారాం, గ్రామస్తులు ఆత్రం గంగారాం, కుమ్ర యాదవ్, లక్ష్మణ్ ఉన్నారు.

కుక్క దాడి చేసిన వారు చికిత్స చేయించుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 16 : ఈ నెల 14వ తేదీన మండల కేంద్రంలోని గాంధీ చౌక్, హనుమాన్ గల్లీ, కొత్తవాడలో ఎనిమిదిపై కుక్క దాడి చేసి గాయపర్చింది. శుక్రవారం డీఎల్పీవో ఫణిందర్ బాధితులను ఇంటింటికీ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు కచ్చితంగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పిచ్చి కుక్కలు లేకుండా పంచాయతీ సిబ్బంది చూడాలన్నారు. బాధితుల నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, ఆశకార్యకర్త జ్యోతి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఇచ్చోడ, ఆగస్టు 16: ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ మండలానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం అడిగామ(కే) గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇరువైపుల ఉన్న ఇండ్ల స్థలాలు కోల్పోతున్న వారు రోడ్డు నిర్మాణానికి సహకరించాలన్నారు. రోడ్డుకు ఇరువైలా 17 ఫీట్ల స్థలం ఇవ్వాలని కోరారు. దీనికి గ్రామస్తులు 17 ఫీట్ల స్థలం ఇస్తున్నట్లు తీర్మానం చేశారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఐఈవోకు వినతి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 16 : గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు శుక్రవారం జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి పరశురాం, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 ఏండ్లుగా జిల్లాలో 54 మంది అధ్యాపకులు గెస్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నామని, ఉద్యోగ భద్రత, అతిథి అధ్యాపకుల కొనసాగింపును, న్యూమర్ పోస్టుల ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు. ఇక్కడ అతిథి అధ్యాపకులు రాకేశ్, నగేశ్, సాయినాథ్, గంగాధర్, సందీప్, సాయిప్రసాద్ ఉన్నారు.

నానో యూరియా, నానో డీఏపీపై అవగాహన

సోన్, ఆగస్టు 16 : సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామంలో ఏఈఓ అంబాజీ శుక్రవారం రైతులకు నానో యూరియా, నానో డీఏపీపై అవగాహన కల్పించారు. నానో యూరియా నత్రజని అందించే ఎరువు, మొక్కలలో పచ్చదనం, చురుకైన పెరుగుదల, పంటల అభివృద్ధికి దోహదపడుతుందని, యూరియాను ఎక్కువగా వాడడం వల్ల పంటలు పురుగు, తెగుళ్లకు సోకే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్రీమ్ సొసైటీ కో ఆర్డినేటర్ చిన్నయ్య, గ్రామాభివృద్ధి ఫోరం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వారిని శిక్షిస్తాం

పోలీసులకు సూచనలు చేస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

బాసర , ఆగస్టు 16 : బాసర సరస్వతీ అమ్మవారి ఉప ఆలయంలో చోరీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శుక్రవారం బాసర పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. దొంగతనం ఘటన శోచనీయమని, ఆలయంలో ఇలా గతంలో ఎప్పుడు జరగలేదని, ఆ రోజు విధుల్లో ఉన్న హోంగార్డులను తొలగించి ఎస్పీ ఆఫీసుకు అటాచ్ చేస్తామన్నారు. అదే విధంగా మిగతా హోంగార్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే, ప్రోటోకాల్ పరంగా సమస్యలు ఎదురైతే ఊరుకునేది లేదని, అడుగడుగున సీసీ కెమెరాలు ఉండే విధంగా చూడాలని ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. నెల రోజుల్లో ఆలయాన్ని పర్యవేక్షణలో ఉంచే విధంగా బాధ్యత తీసుకుంటామని, నిందితులను త్వరలోనే పట్టుకొని మీడియా ముందు ప్రవేశ పెడతామన్నారు. ముందుగా పోలీసులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆమె వెంట సీఐ మల్లేశ్, ఎస్ఐ గణేశ్ ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

ఎదులాపురం, ఆగస్టు 16 : క్రీడల్లో గెలుపోటములు సహజమని డైరెక్టర్ హెచ్ఏఆర్డీ అశోక్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ సర్కిల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై వాలీబాల్, క్యారం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హెచ్ఏఆర్డీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని టీఎస్ ఎన్పీడీసీఎల్, డీఎస్పీ డీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కో కంపెనీలు కలిసి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. వాలీబాల్, క్యారమ్‌కు సంబంధించి వచ్చిన జట్లు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ జేఆర్ చౌహాన్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

సోన్, ఆగస్టు 16 : సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన పీ శ్రీనివాస్ (46) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...శ్రీనివాస్ కుటుంబ గొడవలతో మనస్థాపం చెంది తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు..

తలమడుగు, ఆగస్టు 16 : పురుగుల మందుతాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలమడుగుకు చెందిన అంగ లక్ష్మి(67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. లక్ష్మి గతంలో కండ్ల ఆపరేషన్ జరిగింది. అయినప్పటికీ ఆరోగ్యం బాగా లేక మనస్తాపానికి గురయ్యేది. జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి పడి పోయింది. భర్త రాజేశ్వర్ గమనించి హుటాహుటిన అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోథ్ పీఏసీఎస్ చైర్మన్‌ను తొలగించాలి

బోథ్, ఆగస్టు 16 : బోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ను తొలగించాలని శుక్రవారం జిల్లా కోఆపరేటివ్ అధికారి మోహన్‌కు సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. తొమ్మిది నెలలుగా సాధారణ సమావేశంలో ఆరు నెలలకు ఒకసారి జరిగే మహాజన సభను నిర్వహించలేదని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు, రైతులు సమావేశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సభ్యులు గొర్ల రాజు యాదవ్, చాట్ల ఉమేశ్, లోలపు పోశెట్టి, నారాయణ ఉన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న యూత్ సభ్యులు

బోథ్, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా శుక్రవారం కౌత(బీ) గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్యులు

ఎదులాపురం, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ, మాజీ మంత్రి

బాసర , ఆగస్టు 16 : బాసర సరస్వతీ అమ్మవారిని శుక్రవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి తన తన మనువరాలికి అక్షరాభ్యాసం చేయించారు. ఈయన వెంట ఆలయాధికారులున్నారు.

బాసర ఆలయంలో డీఈవో పూజలు..

బాసర సరస్వతీ అమ్మవారికి శుక్రవారం నిర్మల్ జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తమ జిల్లా విద్యాధికారిగా అవార్డును అందుకున్న సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

'మావాటా మాకే' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 16 : తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరి శంకర్ రచించిన మా వాటా మాకే పుస్తకాన్ని శుక్రవారం స్థానిక ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ దామెర రాములు, కృష్ణంరాజు, బీసీల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న, జగదీశ్, శ్రీనివాస్, అశోక్, సంపత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసాటౌన్, ఆగస్టు 16 : మాంజ్రీ గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మణ్(64) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... మాంజ్రి గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మణ్ బుధవారం రాత్రి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎడ్ల బండిని తప్పించే క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.. గమనించిన స్థానికులు భైంసాలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గురువారం మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భైంసా రూరల్ ఎస్ఐగా శ్రీనివాస్‌యాదవ్

భైంసాటౌన్, ఆగస్టు 16 : భైంసా రూరల్ ఎస్ఐగా శుక్రవారం శ్రీనివాస్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన శ్రీకాంత్ బదిలీపై నిజామాబాద్ జిల్లా మెండోరా మండలానికి వెళ్లగా అక్కడి ఎస్ఐ భైంసా రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఆయనను పోలీసు సిబ్బంది ఘనంగా స్వాగతించి అభినందనలు తెలిపారు.

లోకేశ్వరం ఎస్ఐగా అశోక్

లోకేశ్వరం, ఆగస్టు 16: లోకేశ్వరం ఎస్ఐగా అశోక్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకముందు ఆయన నిజామాబాద్ 5వ టౌన్ యందు విధులు నిర్వహించి బదిలీపై లోకేశ్వరానికి వచ్చారు.

మున్సిపాలిటీని అన్ని రకాలుగా అభివృద్ధి చేద్దాం

డ్రైనేజీని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, ఆగస్టు 16 : గ్రేడ్ వన్‌గా మారిన మున్సిపాలిటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఖానాపూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అర్బన్ తహసీల్దార్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో రూ.320 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు తాగునీటి సరఫరా కోసం ఓ హెచ్ఎస్ఆర్‌లు ఏర్పాటు చేసి, నెల రెండు నెలల లోపే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే ఖానాపూర్ చెరువు సైతం ఆక్రమణలకు గురైందన్నారు. ఇది మనందరి పట్టణం కాబట్టి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కొందరు అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారి వివరాలతో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అందరూ సహకరించినప్పుడే మంచి జరగడానికి ఆస్కారం ఉందన్నారు. త్వరలో ఆదిలాబాద్ విమానాశ్రయం, రైల్వేలైన్ ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, లాలా మున్న, నాయకులు ఉన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మాణం చేయాలి

మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

ఇంద్రవెల్లి, ఆగస్టు 16 : ప్రతి ఇంటికి తప్పకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. శుక్రవారం ధనోరా(బీ) గ్రామంలో అధికారులతో కలిసి డీఆర్డీవో పర్యటించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయం, మురుగు కాల్వలను పరిశీలించారు. గ్రామంలో నాటిన మొక్కలను పరిశీలించి, మొక్కల సంరక్షణకు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రూపు మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని స్వయం ఉపాధిపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సమీర్ హైమద్, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావ్, ఈజీఎస్ ఏపీఎం జాదవ్ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ జాకేశ్వర్, ఈజీఎస్ టీఏ సంతోష్, ఐకేపీ సీసీ శ్రీరాం, గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

భైంసా, ఆగస్టు, 16: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ భైంసా మండలం ఖత్‌గాం గ్రామస్తులు శుక్రవారం భైంసా పట్టణంలోని నిర్మల్ జాతీయ రహదారిపై ఖడ్గ హోటల్ వద్ద రాస్తారోకో చేశారు. తమ గ్రామానికి రోడ్డు మంజూరై ఏండ్లు గడుస్తున్నా ఇంత వరకూ అధికారులు నిర్మాణ పనులు ప్రారంభించడం లేదన్నారు. పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, బురదమయమైన రోడ్డుపై ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి వచ్చిన గ్రామస్తులతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 16 : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం వైద్యారోగ్య, పంచాయతీ రాజ్, కేజీబీవీ, జ్యోతిబా పూలే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పట్టిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఈవోల బదిలీ

లక్ష్మణచాంద, ఆగస్టు 16 : లక్ష్మణచాంద, కనకాపూర్, పీచర క్లస్టర్లలో పని చేస్తున్న ఏఈవోలు శుక్రవారం బదిలీ అయ్యారు. మండలంలోని పీచర క్లస్టర్‌లో పని చేస్తున్న ఏఈవో పవిత్ర లక్ష్మణచాందకు, మామడ మండలం పొన్కల్ క్లస్టర్‌లో పని చేస్తున్న జీ సుస్మిత పీచరకు, కనకాపూర్ క్లస్టర్‌లో పని చేస్తున్న ఏఈవో సంతోష్ మామడ మండలం పొన్కల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లోకేశ్వరంలో పని చేస్తున్న కుంట మౌనిక కనకాపూర్‌కు బదిలీపై వచ్చారు. లక్ష్మణచాంద క్లస్టర్‌లో పని చేస్తున్న ఉమా మహేశ్వరీ బదిలీపై సోన్ క్లస్టర్‌కు వెళ్లగా, మండలంలోని పీచరలో పని చేస్తున్న పవిత్ర లక్ష్మణచాందకు బదిలీపై వచ్చారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ముథోల్, ఆగస్టు, 16 : నిబంధనలను అతిక్రమించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ముథోల్‌లోని బస్టాండ్ సమీపంలో ఉన్న రోడ్డు అవతలివైపు భూమి ఆక్రమణకు గురికావడంతో వర్షం కురిసిన తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక ప్రజలు ఆర్డీవో కోమల్ రెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ఆర్డీవో స్వయంగా సంఘటన స్థలాన్ని పరిశీలించి వెంబడే అవతలి వైపు గతంలో ఉన్న కాలువను తవ్వించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ముథోల్ సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాయికిరణ్, సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

దేవాలయాలకు నిధులు మంజూరు

భైంసా, ఆగస్టు 16 : ముథోల్ నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు నిధులు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భైంసా మండలం మహాగాం తండాలో చేపడుతున్న జగదాంబ సేవాలాల్ మందిరానికి రూ.98,487, తానూర్ మండలంలోని తొండాల గ్రామంలో నిర్మిస్తున్న మహదేవ్ మందిరానికి రూ. 10,81,138 లు విడుదలైనట్లు త్వరలో దేవాలయం ఖాతాలో ఈ నిధులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు మృతి

కుంటాల, ఆగస్టు 16 : మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన బర్కుంట ఎల్లయ్య (32) శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి వ్యవసాయం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందాడని ఎస్ఐ రజనీకాంత్ తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏజీపీకి సన్మానం

బోథ్, ఆగస్టు 16 : బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన పంద్రం శంకర్ దంపతులను శుక్రవారం నేరేడిపల్లి గ్రామ మహిళలు, గ్రామస్తులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావ్, మాజీ ఉపసర్పంచ్ ఆత్రం జైతు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, కోయిందు పటేల్, గోపాల్, భీంరావ్ ఉన్నారు.

18న కవి సమ్మేళనం

ఎదులాపురం, ఆగస్టు 16 : ఆదిలాబాద్‌లోని బుద్ధ విహార్‌లో ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనిల్ సోడే తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత్రికేయ ప్రాంగణంలో ఆయన మాట్లాడారు. వామన్ దాదా కర్డక్ 102వ జయంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కవులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం కరపత్రాలు విడుదల చేశారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి

భైంసా, ఆగస్టు 16 : భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, బీజేవైఎం జనరల్ సెక్రటరీ బండారి దిలీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 16 : హస్నాపూర్ గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో రాంప్రసాద్ పర్యటించారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుకొని డ్రైనేజీలో నిలిచిన ముగురు నీరును జేసీబీ ద్వారా తొలగించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేట్లు చూడాలని